క్లుప్తంగా

ఆచార్య శ్రీనివాస్‌రావుకు జాతీయ పురస్కారం

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విభాగం ఆచార్యులు పెద మళ్ల శ్రీనివాస్‌రావుకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ పురస్కారం అందుకున్నారు. సోమవారం రాత్రి హైదరాబాద్‌లోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలో పురస్కారాల ప్రదానంలో ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, భారత తెలుగు సాంస్కృతిక సమాఖ్య జాతీయ కార్యదర్శి డాక్టర్ గనగళ్ల విజయ్‌కుమార్ చేతులమీదుగా శ్రీనివాస్‌రావు పురస్కారం అందుకున్నారు. శ్రీనివాస్ విద్యా పరంగ,పరిశోధనలపరంగా అందిస్తున్న సేవలకుగాను ఈ పురస్కారం లభించింది.

మెగా వైద్య శిబిరం

కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్రీ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన మెగా వైద్యశిబిరాన్ని ఆలయ వైదిక కార్యక్రమాల నిర్వాహకులు ఐనవోలు రాధాకృష్ణశర్మ ప్రారంభించారు.శిబిరంలో 154 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులను పంపిణీ చేశారు. డాక్టర్ వైద్యం గౌతమ్, డాక్టర్ వైష్ణవి మాన్స, పాల్గొన్నారు.

ముగిసిన వార్షికోత్సవం

కాశిబుగ్గ: వరంగల్ కాశిబుగ్గలోని శ్రీకాశీవిశ్వేశ్వరాలయంలో మూడు రోజులుగా నిర్వహిస్తున్న పంచమ వార్షికోత్సవాలు మంగళవారం ముగిశాయి. మధ్యాహ్నం కాశీవిశ్వేశ్వరునికి 100 కిలోల అన్నంతో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులందరికీ అన్నప్రసాద వితరణ చేశారు. అనంతరం యాగశాలలో పూర్ణాహుతి నిర్వహించారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడుదాం

ఖిలావరంగల్ : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్యంగా పోరాడుదామని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు రాజు పిలుపునిచ్చారు. మంగళవారం వరంగల్ ఫోర్ట్‌రోడ్డులోని గోదాముల వద్ద ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో 138వ మేడే వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. స్వాతంత్ర్యానికి పూర్వమే పోరాడి సాధించుకున్న హక్కులు,చట్టాలను కేంద్రం పెట్టుబడిదారులకు తాకట్టుపెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మైదంపాణి, మోహన్, రాజన్న, వెంకటస్వామి, చిన్నస్వామి, ఎల్లయ్య, వెంకటేష్, మల్లేశం, రాజు పాల్గొన్నారు

చలివేంద్రం ప్రారంభం

కాజీపేట: కాజీపేట చౌరస్తాలో మాజీ డీసీసీబీ చైర్మన్ జంగా రాఘవరెడ్డి సహకారంతో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని మంగళవారం 62, 63వ డివిజన్ల కార్పొరేటర్లు జక్కుల రవీందర్ యాదవ్, విజయశ్రీ సయ్యద్‌రజాలీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతుతూ వేసవిలో ఎండ వేడిమి నుంచి ఉపశమనం కలిగేలా ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రంను ఏర్పాటుచేయడం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో సందెల విజయ్, కొడిపాక గణేష్, సుంచు చంద్రయ్య, బోయిని కుమార్ యాదవ్, మాచర్ల జయాకర్, పాల్గొన్నారు.

నేడు తాళ్ల పద్మావతికి సింగర్ సాయివేద రాక

కరీమాబాద్: వరంగల్ హంటర్ రోడ్డులోని తాళ్ల పద్మావతి ఇంటర్నేషనల్ స్కూల్‌లో బుధవారం జరుగనున్న వార్షికోత్సవ వేడుకలకు జీ సరిగమ లిటిల్ ఛాంప్స్ టైటిల్ విన్నర్స్ సింగర్ సాయివేద వాగ్దేవి హాజరువుతున్నారని విద్యాసంస్థల చైర్మన్ తాళ్ల మల్లేశం మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సింగర్‌గా డబ్బింగ్ ఆర్టిస్టుగా ప్రేక్షకులకు సుపరిచితురాలైన సాయివేదతోపాటు ముఖ్యఅతిథులుగా వరంగల్ ఏసీపీ బోనాల కిషన్, డీఈఓ వాసంతి హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు. ప్రముఖ సంగీత దర్శకులు తమస్ నిర్వహించే మ్యూజికల్ నైట్స్ ఈవెంట్స్‌లో బేబీ సాయివేద ప్రత్యేక పాటల కార్యక్రమం ఉంటుందన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ప్రభుత్వ చీఫ్ విప్ చేయూత



హన్మకొండ: ప్రపంచవ్యాప్తంగా సైకిల్ యాత్ర చేస్తున్న తెలంగాణ ఉద్యమకారుడు డ్యాగర రాములు కుమారుడు రంజిత్ కుమార్‌కు రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ చేయూతనందించారు. మంగళవారం మడికొండలో జరిగిన బీఆర్ఎస్ పశ్చిమ నియోజకవర్గ ప్లీనరీలో సైకిల్‌పై ప్రపంచ పర్యటన చేస్తున్న రంజిత్‌కుమార్‌కు రూ.1,01,116 ఆర్థికసాయాన్ని అందించి, శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. అదే విధంగా కలిమంజారోతో పాటు పలు పర్వతాల్ని అధిరోహించిన హనుమకొండకు చెందిన రాసమల్ల అఖిల్‌కు రూ.51 వేల సాయాన్ని, కుటుంబ సభ్యులతో కలిపి శాలువా కప్పి సన్మానించారు. ఇంటర్నేషనల్ చెస్‌మాస్టర్ అగ్నికి రూ. 51 వేల సహాయాన్ని అందించి సన్మానించారు. రామకోటి రాసి హిందూ దేవాలయాలకు వెళ్తూ, పూజలు చేస్తూ నిలుస్తున్న యాకూబ్ పాషాకు రూ.51 వేల సాయం అందించి సన్మానించారు. అదేవిధంగా బులియన్ మర్చంట్ అధ్యక్షుడిగా ఎన్నికైన శ్రీనివాస్‌ను చీఫ్‌విప్ సన్మానించారు.

సమీకృతం సుదూరమేనా!

- ఎన్నికలు సమీపిస్తున్నా.. ఇప్పటికీ లేని ప్రభుత్వ పాలనభవనం
- ఆజంజాహి భూమి కేటాయించినా.. మొదలుకాని నిర్మాణ పనులు
- భూ వివాదం పరిష్కారమైనా.. నిర్మాణ పనులకు నిధుల మంజూరులో అనాసక్తి



సాక్షి, వరంగల్: వరంగల్ జిల్లా పరిపాలన సేవలకు శాశ్వత పరిపాలన భవన నిర్మాణం విషయంలో అడుగు ముందుకుపడలేదు. మార్చి 9వ తేదీన చేనేత జౌళి శాఖకు చెందిన ఆజంజాహి మిల్లులోని 20.32 ఎకరాల భూమిని రెవెన్యూ విభాగానికి బదిలీ చేసేందుకు అనుమతినిచ్చినా.. ఇప్పటివరకు నిర్మాణ పనుల విషయంలో ప్రభుత్వ ఉన్నతాధికారులు ఏ నిర్ణయం తీసుకోకపోవడంతో ఇప్పట్లో ‘సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం’ కట్టడం సుదూరమేనన్నా మాటలు వినిపిస్తున్నాయి. ఎన్నికలు సమీపిస్తున్న వేళ దీన్ని పట్టించుకునే నాథుడు కరువవడంతో జిల్లా ప్రభుత్వ ఉద్యోగులు కూడా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ప్రజలు కూడా కలెక్టరేట్‌తో సహా ఏ విభాగంలో పని ఉన్నా హనుమకొండలోని వివిధ కాలనీల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా ముఖ్యనేతలు కూడా వారి వారి నియోజకవర్గాలపైనే దృష్టి సారించడంతో శాశ్వత కలెక్టరేట్ భవనం విషయం అటకెక్కిందన్న టాక్ వస్తోంది. ఇప్పటికైన త్వరగా ఇతర జిల్లాల్లో ఇప్పటికే అందుబాటులోకి వచ్చిన సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం మాదిరిగానే ఇక్కడా కూడా ఉండేలా చూడాలని ఇటు ఉద్యోగులు, అటు ప్రజలు కోరుతున్నారు.

భూ వివాదం పరిష్కారం..

ఉమ్మడి వరంగల్ పునర్విభజనలో భాగంగా జిల్లా కేంద్రం లేకుండా ఏడేళ్ల క్రితం వరంగల్ రూరల్ జిల్లా ఏర్పడింది. ఒకానొక దశలో పరకాల, నర్సంపేట జిల్లా కేంద్రం కావాలనే డిమాండ్లు తెరపైకి వచ్చినా అడుగు ముందుకు పడలేదు. 2021 సెప్టెంబర్‌లో వరంగల్ అర్బన్‌ను హనుమకొండ, వరంగల్ రూరల్‌ను వరంగల్‌గా మారుస్తూ సీఎం కేసీఆర్ ప్రకటించారు. 2021 డిసెంబర్‌లో ఆజంజాహి మిల్లులో 6.16 ఎకరాల్లో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంతో పాటు 2.32 ఎకరాల్లో చేనేత జౌళి డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం స్థలం కేటాయించింది. అప్పటికే ఆజంజాహి మిల్లు రిటైర్డ్ కార్మికులు ఆజంజాహి మిల్స్ మాడిఫైడ్ వలంటరీ రిటైర్డ్ 2002 ఈయర్ ఆఫ్ వర్కర్స్ అసోసియేషన్‌గా ఏర్పడి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఇలా హైకోర్టులో పలు వాదనలు జరిగాక సుప్రీం కోర్టుకు వెళ్లాలని చెప్పడంతో 2019లో ఫిబ్రవరిలో వెళ్లారు. దీనిపై వాదనలు విన్న అత్యున్నత న్యాయస్థానం ఏప్రిల్ 15న మిల్లు భూములపై స్టేటస్ కో ఇచ్చింది. తాజాగా అర్హులైన కార్మికులకు ప్లాట్లు కేటాయించాలంది. 2023 జనవరి 18న 318 మంది ఉద్యోగులకు హసన్‌పర్తి మండలంలో కుడా అభివృద్ధి చేసి మేడిపల్లి, అనంతసాగర్‌లో ప్లాట్లను కేటాయించామని కుడా వైస్ చైర్మన్ తెలపడంతో వివాదానికి తెర పడింది. 2023 మార్చి 9న వరంగల్ మండలం లక్ష్మీపురంలోని 62, 63, 65, 66, 67, 68, 71, 76, ఖిలావరంగల్ మండలంలోని 368, 370, 371, 372, 373, 374, 375, 376, 377 సర్వే నంబర్లలోని 20.32 ఎకరాల చేనేత జౌళి శాఖ రెవెన్యూ విభాగానికి బదిలీ చేసేందుకు సర్కార్ అనుమతినిచ్చింది. ఇది జరిగి నెలన్నర కావస్తున్నా ‘ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీస్ కాంప్లెక్స్’ నిర్మాణానికి నిధులు కేటాయించకపోవడంతో జిల్లాలో చర్చ జరుగుతోంది. ఈ అంశం ఎన్నికల వేళలోనూ రాజకీయంగా విమర్శలొచ్చే అవకాశం ఉందన్న టాక్ ఉంది. ‘కలెక్టర్ గోపీ ఉండగానే ఈ స్థలం కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆ తర్వాత వచ్చిన కలెక్టర్ ప్రావీణ్య ఈ 'ఇంటిగ్రేటెడ్ డిస్ట్రిక్ట్ ఆఫీస్ కాంప్లెక్స్' నిర్మాణం విషయంలో ప్రభుత్వ ఉన్నతాధికారులను సమన్వయం చేయడం లేదని ప్రభుత్వ వర్గాలే అంటున్నాయి. ఇప్పటికైనా ఈ విషయంలో చొరవ చూపాలని ప్రజలు అంటున్నారు.

మలేరియాను పారద్రోలాలి



కరీమాబాద్‌లో జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌ఓలు

వరంగల్ అర్బన్/హన్మకొండ చౌరస్తా: 2030 నాటికి ఇండియా నుంచి మలేరియాను పారద్రోలి మలేరియా రహిత దేశం తీర్చిదిద్దాలని వరంగల్, హనుమకొండ జిల్లాల డీఎంహెచ్‌ఓలు సాంబశివరావు, వెంకటరమణ అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం జీడబ్ల్యూఎంసీ, హన్మకొండ, వరంగల్ జిల్లాల వైద్య ఆరోగ్య శాఖల సంయుక్తంగా అవగాహన ర్యాలీలు, సదస్సులను నిర్వహించారు. హన్మకొండ పరిధిలోని కేడీసీ నుంచి మెటర్నిటీ హాస్పిటల్ వరకు, వరంగల్ పరిధిలో ఎస్ఆర్ఆర్.తోట నుంచి సుభాష్ విగ్రహం వరకు అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మలేరియా వ్యాధి నియంత్రణపై ప్రజల్లో అవగాహన పెంపొందించడానికి ర్యాలీలు, సదస్సులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రానున్న వర్షాకాలం నేపథ్యం లో సీజనల్ వ్యాధులైన డెంగ్యూ, చికున్ గున్యా, మలేరియా వంటి వ్యాధుల నియంత్రణకు ప్రణాళికబద్ధంగా వ్యవహరిస్తూ క్షేత్రస్థాయిలో నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. ఇంటింటికి జ్వర సర్వే నిర్వహించడంతో బాధితులను గుర్తించి సత్వర చికిత్స అందించడం ద్వారా మలేరియా బాధితులను గణనీయంగా తగ్గించవచ్చన్నారు. కార్యక్రమములో సీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజేష్, బయాలజిస్ట్ జీ.మాధవ రెడ్డి, ప్రోగ్రాం అధి కారులు మదన్‌మోహన్, మధుసూదన్‌తో పాటు బల్దియా హెల్త్ ఇన్‌స్పెక్టర్లు మధుకర్, రవి, సిబ్బంది పాల్గొన్నారు.

సీఎల్పీ నేతకు కేయూ జేఏసీ వినతి



సీఎల్పీ నేత విక్రమార్కను కలిసి వినతిపత్రం అందజేస్తున్న కేయూ జేఏసీ నాయకులు

కేయూ క్యాంపస్: కేయూ మొదటి గేట్ సమీపంలో సీఎల్పీ నేత మల్లుభట్టి విక్రమార్క బసచేసిన ప్రాంతంలో మంగళవారం ఉదయం కాకతీయ యూనివర్సిటీ జేఏసీ నాయకులు కలిసి పలు సమస్యలపై విన్నవించి వినతిపత్రం సమర్పించారు. అందులో ప్రభుత్వరంగ సంస్థల్లో, ప్రభుత్వ యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అన్నిరకాల పోస్టులను భర్తీ చేయించాలని కోరారు. విద్యార్థులకు రావాల్సిన ఫీజు రీయంబర్స్‌మెంటు, స్కాలర్‌షిప్ పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయించేలా పోరాడాలని భట్టిని కోరారు. సీఎల్పీని కలిసిన వారిలో జాక్ చైర్మన్ ఇట్టబోయిన తిరుపతి, బాధ్యులు మేడ రంజిత్‌కుమార్, ఆలువాల కార్తీక్ , డాక్టర్ మంద వీరస్వామి, రాజునాయక్, విజయ్‌కన్నా, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీఎస్‌యూటీఎఫ్ బాధ్యులు వినతిపత్రం

సీఎల్పీ నేత భట్టి విక్రమార్కను తెలంగాణా ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు తాటికాయల కుమార్, ప్రధాన కార్యదర్శి బద్దం వెంకటరెడ్డి, కార్యదర్శి సమ్మక్క కలిసి ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేలా కృషి చేయాలని కోరారు. గత ఎనిమిదేళ్లుగా ఉపాధ్యాయులకు బదిలీలు చేపట్టడం లేదని పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

రాష్ట్ర అభివృద్ధి పట్టని బీజేపీ

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు
- బొల్లికుంటలో ఇంటింటికి సీపీఐ



మాట్లాడుతున్న తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు

ఖిలావరంగల్ : తెలంగాణ అభివృద్ధిపై బీజేపీ నిర్లక్ష్యపు ధోరణి వహిస్తుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తక్కళ్లపల్లి శ్రీనివాస్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని బొల్లికుంటలో సీపీఐ జిల్లా కార్యదర్శి మేకల రవి, జిల్లా సహాయ కార్యదర్శి షేక్ బాష్మియా ఆధ్వర్యంలో ఇంటింటికి సీపీఐ కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం దండు లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి పట్ల తీవ్ర వివక్షతను ప్రదర్శిస్తున్నదని, రాష్ట్ర విభజన సమయంలో ఇచ్చిన హామీలను నేటికి అమలు చేయలేదని మండిపడ్డారు. బీజేపీ పాలనలో పేదలు మరింత పేదలుగా ధనవంతులు మరింత ధనవంతులుగా మారిపోయారన్నారు. ఇకనైనా మోదీ ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు తగ్గించి నిత్యావసర ధరలను అదుపులోకి తీసుకరావాలని కోరారు. ఈ సమావేశంలో గన్నారపు రమేష్, బద్రి, ఎలేందర్, రవి, రమేష్, శరత్, టి.రోహిలా, సుధీర్, సౌందర్య, జోసెఫ్, కుమార్, సువర్ణ పాల్గొన్నారు.

ఘనంగా బీఆర్ఎస్ జెండా పండుగ

బీఆర్ఎస్ 22వ ఆవిర్భావ వేడుకల్లో గ్రేటర్ పరిధిలోని కార్పొరేటర్లు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొని పార్టీ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం తూర్పు నియోజకవర్గంలో ఓ సిటీలో జరిగిన పార్టీ ప్లీనరీ సమావేశానికి, పశ్చిమ నియోజకవర్గంలో మడికొండలోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన ప్లీనరీ సమావేశాలకు తరలివెళ్లారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ ముఖ్యనాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

– సాక్షి, నెట్‌వర్క్



కాజీపేట రూరల్ : జెండా ఆవిష్కరించిన అనంతరం మాట్లాడుతున్న కుడా మాజీ చైర్మన్ యాదవరెడ్డి



కాశిబుగ్గ : ఓ సిటీలో జరిగిన ప్లీనరీకి తరలివెళ్తున్న బీఆర్ఎస్ నాయకులు



వరంగల్ : ప్లీనరీకి తరలివెళుతున్న నేతలు



కాజీపేట అర్బన్ : సోమిడిలో బీఆర్ఎస్ ఆవిర్భావ వేడుకలను జరుపుకుంటున్న కార్యకర్తలు

డిప్లొమా కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

కాకోజీ సెంటర్: హైదరాబాద్‌లోని దుర్గాబాయి దేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళా టెక్నికల్ శిక్షణ సంస్థలో పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సులకు 2023–24 విద్యా సంవత్సరానికి తల్లిదండ్రులు కోల్పోయిన (అనాథ) బాలికలు మూడు సంవత్సరాల డిప్లొమా కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సంక్షేమాధికారి మాచర్ల శారద మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్ ఇంజనీరింగ్, కంప్యూటర్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ తదితర కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకోవాలన్నారు. మొత్తం 240 సీట్లను గాను 70 శాతం సీట్లు అనాథ బాలికలకు కేటాయించినట్లు ఆమె తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులన్నారు. ఆసక్తిగల బాలికలు హన్మకొండ కాకాజీ కాలనీలోని బాలరక్షాభవన్‌లో దరఖాస్తు ఫారం పూర్తి చేసి కులం, ఆదాయం, బోనాఫైడ్, ఎస్ఎస్‌సీ మెమో, టీసీ, స్టడీ సర్టిఫికెట్, రెండు పాస్‌ఫొటోలు జతచేసి మే 10వ తేదీలోపు అందజేయాలన్నారు. పూర్తి వివరాలకు 8464988186 లేదా 9676096183 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.


దరఖాస్తుల గడువు పొడిగింపు

మహిళా, శిశు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ, తెలంగాణ దివ్యాంగుల సహకార సంస్థ ఆధ్వర్యంలో 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను జిల్లాలోని దివ్యాంగులకు అందించే ఉపకరణములను పంపిణీ చేసేందుకు దరఖాస్తుల గడువును మే 5వ తేదీ వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. జిల్లాలోని ఇంటర్మీడియట్, ఆపై ఉన్నత చదువులు చదువుతున్న అర్హులైన దివ్యాంగులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. టీఎస్‌ఓబీఎంఎంఎస్. సీజీజీ. జీఓవీ. ఇన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. పూర్తి వివరాలకు జిల్లా సంక్షేమ శాఖ కార్యాలయంలో సంప్రదించవచ్చు.

ఘనంగా ఆదిశంకరాచార్యుల జయంతి వేడుకలు

హన్మకొండ చౌరస్తా: జగద్గురు శ్రీశ్రీశ్రీ ఆదిశంకరాచార్యులు లేకపోతే నేడు సనాతన హిందూ ధర్మం ఉండేది కాదని, ఆయన ఈ పవిత్ర భారతావని లో జన్మించిన కారణజన్ములని విశ్వబ్రాహ్మణ ధర్మపీఠం సంచాలకులు చొల్లేటి కృష్ణమాచార్యులు అన్నారు. ఆదిశంకరాచార్యుల జయంతి వేడుకలు మంగళవారం హనుమకొండ చౌరస్తాలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతు సనాతన హిందూ సంస్కృతి, సాంప్రదాయాల పరిరక్షణకు, ప్రజల్లో ఆయన తీసుకొచ్చిన చైతన్యవంతమైన సేవలను కొనియాడారు. విశ్వబ్రాహ్మణ, విశ్వకర్మ జాతి నాయకులు డాక్టర్ విష్ణువర్ధన్, వీ రన్న, సదానందం,కృష్ణమూర్తి, చక్రపాణి, రామన్న, వీరన్న, నాగ, మహేశ్వరం బిక్షపతి, పాల్గొన్నారు.

ముగిసిన దర్గా ఉత్సవాలు



దర్గాపై పట్టువస్త్రాలు కప్పుతున్న నవీద్‌బాబు

ఖిలావరంగల్ : వరంగల్ 41వ డివిజన్ ఉర్సు కరీమాబాద్ షామీర్‌పూర్‌లో హజ్రత్ మీజీ కలందర్ బాబా దర్గాలో ఈనెల 23న ప్రారంభమైన గంధం, ఉర్సు దర్గా ఉత్సవాలు మంగళవారం రాత్రి ముగిశాయి. దర్గా అధ్యక్షుడు మహ్మద్ మాషూక్ ఆధ్వర్యంలో ఉత్సవాలు జరిగాయి. ముస్లిం మత గురువుతోపాటు దర్గా పీఠాధిపతి నవీద్‌బాబు హాజరై ప్రార్థనలు చేశారు. దర్గాపై పూలమాలలు, పట్టు వస్త్రాలు కప్పి అత్యంత భక్తి శ్రద్ధలతో బాబాను దర్శించుకున్నారు. వలీబాబా, యాకూబ్‌పాషా, దస్తగిరి, ఆసీఫ్, సమీనా, తాజ్, అక్బర్ పాల్గొన్నారు.

వయోవృద్ధుల సమస్యలు తీర్చండి



ఎంజీఎం : వయోవృద్ధులు, ఎండవేడిమికి గురికాకుండా తగిన సూచనలు చేస్తూ తగిన మందులు అందించాలని సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు డీఎంహెచ్‌ఓ సాంబశివరావును కోరారు. మంగళవారం జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయంలో సీనియర్ సిటిజన్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు డీఎంహెచ్‌ఓను కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి గురువారం వయోవృదద్ధులకు మాత్రమే ప్రత్యేకంగా చికిత్సలు చేస్తున్న విషయాన్ని గ్రామ,పట్టణ వయోవృద్ధులకు తగిన ప్రచారం చేయాలని కోరారు. వయోవృదద్ధులకు ఏమైనా సమస్యలు ఉంటే టోల్ ఫ్రీ నంబర్ 14567 చేసే విధంగా వారి ఆరోగ్యశాఖ సిబ్బందిచే అవగాహన కల్పించాలని కోరారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ, వైద్యారోగ్యశాఖాధికారుల చేతుల మీదుగా వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు తేరాల యుగేందర్, కార్యదర్శి కొండ్రు మల్లారెడ్డి, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ప్రసన్నాంజనేయ స్వామికి అభిషేకం

హన్మకొండ: హనుమకొండ పద్మాక్షి కాలనీలోని హనుమద్గిరి శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా ఆచార్యులు, భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. మంగళవారం స్వామివారికి పంచామృత అభిషేకం, చందన సేవ ఆకు పూజ, వడమాలలతో ఒక వెయ్యి ఎనిమిది మామిడిపండ్లతో అలంకరణ, అర్చన పూజా కార్యక్రమాలను వేద పండితుడు ఆరుట్ల రామాచార్యులు, భాస్కరాచార్యులు నిర్వహించారు.

మహనీయుడు ఆదిశంకరాచార్యుడు

హన్మకొండ: భక్తి భావాన్ని పెంపొందించిన మహనీయుడు ఆదిశంకరాచార్యుడని ప్రముఖ యోగా గురువు పోశాల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్ యోగా శిక్షణ శిబిరం ఆధ్వర్యంలో హోటల్‌లో ఆదిశంకరాచార్యుల జయంతిని ఘనంగా జరుపుకున్నారు. శ్రీనివాస్ జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలు ప్రారంభించారు.

ధరిత్రిని ప్రతిపౌరుడు రక్షించుకోవాలి



హన్మకొండ: ధరిత్రిని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి పౌరుడిపై ఉందని నిట్ విశ్రాంత ప్రొఫెసర్ కె.లక్ష్మారెడ్డి అన్నారు. మంగళవారం హనుమకొండ కనుకదుర్గ కాలనీలోని పార్కులో ది ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్, ప్రేరణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ధరిత్రి దినోత్సవాన్ని జరుపుకున్నారు. ప్రేరణ ఫౌండేషన్ ప్రతినిధి పెండ్లి ఉపేందర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కె.లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. మున్సిపల్ కార్పొరేషన్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాజేష్, కార్పొరేటర్ పాల్గొన్నారు.

భూసేకరణ పనులు వేగవంతం చేయాలి

వరంగల్: కాజీపేట నుంచి విజయవాడ 3వ రైల్వే లైన్, మంచిర్యాల నుంచి వరంగల్–ఖమ్మం, నాగపూర్ నుంచి విజయవాడ వరకు నిర్మించ తలపెట్టిన నేషనల్ హైవే భూ సేకరణ పనులను వేగవంతం చేయాలని గవర్నమెంట్ ఆఫ్ ఇండియా క్యాబినెట్ సెక్రటరీ రాజీవ్ అన్నారు. మంగళవారం గవర్నమెంట్ ఆఫ్ ఇండియా క్యాబినెట్ సెక్రటరీ ఢిల్లీ నుంచి రైల్వేలైన్, నేషనల్ హైవే భూసేకరణ పనులపై వీడియో కాన్ఫరెన్స్‌లో పలు జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. కాన్ఫరెన్స్‌లో మూడో రైల్వే లైన్, నేషనల్ హైవే భూ సేకరణ పనులపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ వీసీలో కలెక్టర్ పి.ప్రావీణ్య, అదనపు కలెక్టర్ శ్రీవత్సకోటలు పాల్గొన్నారు.

శోభాయమానంగా పల్లకి సేవ

వరంగల్ చౌరస్తా : భగవత్ రామానుజుల తిరునక్షత్రం1006 మహోత్సవం సందర్భంగా మంగళవారం రామానుజులను పల్లకిలో మంగళ వాయిద్యాలతో డప్పు చప్పుళ్లతో, మంగళ హారతులతో శోభాయమానంగా యాత్రను నిర్వహించారు. వరంగల్ గోవిందరాజుల గుట్ట నుంచి మెట్ల ద్వారం వరకు స్వామిని వైభవంగా వేదమంత్రాలతో ఆలయ అర్చకులు లక్ష మల్లెలతో స్వామికి అర్చనలు, అభిషేకలు నిర్వహించారు.

నేడు సూర్యప్రభ వాహన సేవ

వరంగల్: వరంగల్, హన్మకొండ పద్మశాలి సంఘాల ఆధ్వర్యంలో బుధవారం సదస్యం, ఉదయం సూర్యప్రభ వాహన సేవలు జరుగు తాయని పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్షులు ఆడెపు రవీందర్ మంగళవారం తెలిపారు. సాయంత్రం హంస వాహన సేవలు జరుగుతాయని పేర్కొన్నారు.

ట్రైసిటీలో అన్నదానం



కాజీపేట: కాజీపేట స్వయంభూ శ్రీ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో జరుగుతున్న రజతోత్సవ వేడుకలను పురస్కరించుకొని ట్రైసిటీలోని 86 ప్రాంతాల్లో పేదలకు అన్నదానం చేశారు. స్వామివారి పుట్టిన రోజును పురస్కరించుకొని భక్తులు తమ స్వంత ఖర్చులతో హనుమకొండ, వరంగల్, కాజీపేట నగర వ్యాప్తంగా అన్నదానాలు చేశారు. కార్యక్రమాన్ని ఆలయ పరిపాలన అధికారి సాయికృష్ణశర్మ పర్యవేక్షించారు.

శ్రీనివాస్ గురుకుల్‌లో స్నాతకోత్సవం



హన్మకొండ: బాలసముద్రంలోని శ్రీనివాస్ గురుకుల్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ప్రాథమిక విద్యార్థుల స్నాతకోత్సవం జరిగింది. ఏడాది పొడువునా నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులకు హాజరైన విద్యార్థులు ప్రత్యేక డ్రెస్‌లు ధరించి ఉత్తీర్ణత సర్టిఫికెట్లు అందుకోవడంతో ఉత్సాహంగా గంతులేశారు. పాఠశాల కరస్పాండెంట్ చిదురాల సోమరత్నం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గణిత ఉపాధ్యాయులు ఇందిర, శ్రీనివాస్ ముఖ్య అతిథులుగా పాల్గొని సందేశం ఇచ్చారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.